ప్రభుత్వ బడులకు గ్రహణం

- అర్ధంతరంగా ఆగిన పాఠశాల భవన నిర్మాణం
- గర్ల్స్ హైస్కూల్‌లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు


అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల్లోనే పాఠాలు బోధిస్తున్న దృశ్యం


అర్ధంతరంగా ఆగిన గర్ల్స్ హైస్కూల్ భవనం

తాడిపత్రిటౌన్: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ బడులకు గ్రహణం పట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో ఏడాదిగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం నాడు- నేడు కార్యక్రమంతో ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయికి తీసుకు వెళ్తే కూటమి ప్రభుత్వం అథాతంలోకి తోసేసింది. ప్రభుత్వం మారడంతో తాడిపత్రి నియోజకవర్గంలో దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల భవనాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. నిధులు లేక పోవడంతో నియోజకవర్గ వ్యాప్తంగా తరగతి గదులు మొండి గోడలకే పరిమితమయ్యాయి. విద్యార్థులకు తగినన్ని తరగతి గదులు లేక పోవడంతో నిర్మాణంలో ఉన్న గదుల్లోనే పాఠాలు చదువుతూ అవస్థలు పడుతున్నారు. ఇందుకు నిదర్శనంగా తాడిపత్రి మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ నిలుస్తోంది. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10 వతరగతి వరకు దాదాపు 250 మంది విద్యార్థినులు చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' కింద ఆరు తరగతి గదులతో నూతన భవణ నిర్మాణం చేపట్టారు. అయితే ప్రభుత్వం మారడంతో ఏడాదిగా పనులు ముందుకు సాగలేదు. దీంతో విద్యార్థినులకు తగినన్ని గదులు లేకపోవడంతో నిర్మాణంలో వున్న భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. తలుపులు, కిటకీలు లేకపోవడంతో బాలికలకు అవస్థలు తప్పడం లేదు. ఎండ వున్నా... చిన్న వర్షం వచ్చినా పాఠాలు ముందుకు సాగవు. పుస్తకాలతో పాటు విద్యార్థులు తడిచిపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయించి, అర్ధంతరంగా ఆగిన తరగతి గదుల నిర్మాణం చేపట్టి విద్యార్థినుల అవస్థలను తప్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిర్మాణాలు ఆగిపోయాయి



ఏడాదిగా నిర్మాణాలు ఆగిపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. తగినన్ని తరగతులు లేకపోవడంతో నిర్మాణంలో ఉన్న గదుల్లోనే తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. వర్షం వస్తే విద్యార్థినులు అవస్థలు పడాల్సిన పరిస్థితి.

– రాధాక్రిష్ణ, హెచ్ఎం, బాలికల హైస్కూల్, తాడిపత్రి

ఇబ్బందులు పడుతున్నాం



తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఆగిన తరగతి గదుల నిర్మాణాల్లోనే చదువుకోవాల్సి వస్తోంది. కిటకీలు, తలుపులు లేక పోవడంతో వర్షం వచ్చినా, ఎండ ఎక్కువగా ఉన్నా ఇక్కట్లు తప్పవు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి

– ఫాతిమా, 7వతరగతి, బాలికల హైస్కూల్

రాష్ట్రంలో విధ్వంసకర పాలన


మాట్లాడుతున్న జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి తదితరులు

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధ్వంసకర పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ నీలం భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహానేత వైఎస్సార్ విగ్రహం ఎదుట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, బీకేఎస్ సర్పంచ్ పార్వతితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధించడం రాష్ట్ర ప్రజలు చూస్తున్నారన్నారు. ఎల్లకాలం చంద్రబాబు నాయుడు కుట్ర రాజకీయాలు సాగవని మండిపడ్డారు. ఎంత మంది వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలను జైల్లో పెట్టినా భయపడేది లేదన్నారు. టీడీపీ నాయకులు ఏడాది కాలంలో ఒక్క పథకమైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. ఏడుగుర్రాలపల్లిలో ఒక ఎస్సీ బాలికపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అత్యాచారానికి పాల్పడితే.. బాధిత కుటుంబాన్ని ఇంత వరకూ పరామర్శించిన దఖలాలు లేవన్నారు. ఎల్లకాలం మీ ప్రభుత్వం అధికారంలో ఉండదని గుర్తుపెట్టుకోవాలన్నారు. రోజు రోజుకూ జగనన్నపై ప్రజాభిమానం పెరుగుతోందన్నారు. రానున్న కాలంలో జగనే రాష్ట్రానికి మళ్లీ సీఎం అవుతారన్నారు. కార్యక్రమంలో చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ప్రచార కార్యదర్శి పూల రంగా, పురుషోత్తం, కుళ్లాయప్ప, విశ్వరూప, రాము, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' హామీలకు మంగళం


కూటమి వైఫల్యాలకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గుత్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయింది. అయినా సూపర్ సిక్స్ హామీలకు మంగళం పాడారని సీపీఎం నాయకులు విమర్శించారు. గుత్తిలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేయలేదని బుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నిర్మల మాట్లాడారు. మహిళలకు ఫ్రీ బస్సు, రూ. 3 వేలు నిరుద్యోగ భృతి, ఆడ పిల్లలకు నెలకు రూ. 1500, 50 ఏళ్లకే పింఛన్ వంటి పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు, రమేష్, నాయకలు అశోక్, రేవతి, కవిత, రాము, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముసలమ్మ తల్లి స్థలం జోలికొస్తే సహించం


ముసలమ్మ తల్లి ఆలయం ఎదుట ఆందోళన చేస్తున్న భక్తులు, గ్రామస్తులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గ్రామ దేవత ముసలమ్మ తల్లి దేవాలయం స్థలం జోలికి వస్తే సహించేది లేదని ఆలయ ధర్మకర్త సుశీల, గ్రామస్తులు పొడరాళ్ల రవీంద్ర, అశోక్‌కుమార్, సాకే రామక్రిష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముసలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆలయ స్థలాన్ని కాపాడుకునేందుకు ముసలమ్మ భక్తులు, గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయ స్థలాన్ని కొంత మంది తప్పుడు పత్రాలతో కాజేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. గ్రామస్తులంతా ఏకమై ఆలయ స్థలాన్ని రక్షించుకుంటామంటూ ఆలయం ఎదుట భక్తులు నిరసన తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు సూర్య నారాయణరెడ్డి, సాకే రామక్రిష్ణ, నందినేని మల్లికార్జున, పురుషోత్తం, చికెన్ నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, ఆగ్రోస్ రామక్రిష్ణారెడ్డి, జాహ్నవిరెడ్డి, శేషానందరెడ్డి, సురేష్, రాజేష్ రెడ్డి, పెద్ద బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం


చైర్ పర్సన్ వన్నూర్ బీని సన్మానిస్తున్న క్రిస్టియన్ మైనార్టీ కమిటీల సభ్యులు

గుత్తి: మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ కమిటీల సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల గుత్తి , గుత్తి మండల వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ కమిటీలను ఎన్నుకున్నారు. క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు, ప్రధాన కార్యదర్శి గ్లాడ్‌స్టోన్, సభ్యులు ఎస్తేరు ప్రియాంక, నాగేంద్రబాబు, రామారావు, భార్గవ్, జాకోబ్, సాల్మన్ రాజు తదితరులు మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ కన్వీనర్ పీరాలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారిని శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులకు వారు సూచించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ జిల్లా నాయకుడు శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసికోల్లాసం

- నేడు 'యోగాంధ్ర'

గుత్తి రూరల్: రోజూ యోగా చేయడం ద్వారా మానసికోల్లాసంతో పాటుగా ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ అన్నారు. మండలంలోని బసినేపల్లిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామస్తులతో కలిసి ఎంపీడీఓ యోగా ఆసనాలు వేశారు. మండలంలోని 13 సచివాలయాల్లో శనివారం ప్రజలతో కలిసి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 6 గంటల్లోపు ప్రజలు, ప్రజాప్రతినిధులు సచివాలయాల వద్దకు చేరుకోవాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

యల్లనూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయాలని ఎంఈఓ-2 పరమేశ్వరరెడ్డి సూచించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు.

పామిడి: మండలంలో శనివారంఉదయం 6.30 గంటలకు నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రజలు జయప్రదం చేయాలని ఎంపీడీఓ కే తేజోజ్యోత్స్న శుక్రవారం తెలిపారు. స్థానిక సరస్వతీ ఉన్నత విద్యామందిరంతో పాటు అన్ని గ్రామ సచివాలయాలు, నిర్దేశిత ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రజలు, అధికారులు హాజరు కావాలన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం


ఆలయ ధర్మకర్తకు నగదు అందజేస్తున్న టీచర్ సుధాకర్ దంపతులు

గుంతకల్లుటౌన్: కసాపురంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనారాయణ స్వామి రాతి గుడి అభివృద్ధికి రైల్వే స్కూల్ రిటైర్డ్ వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, విజయ దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయ ధర్మకర్త పరుశురాముడుకు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి శాంతి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం దాత సుధాకర్ దంపతులను ఆలయ ధర్మకర్త, అర్చకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుధాకర్ కుటుంబసభ్యులు రాధిక, శశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం


మంటలు ఆర్పుతున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని పసులూరులో శుక్రవారం గడ్డివాము దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. బాధితుల వివరాలు మేరకు.. పసులూరులో లక్ష్మీదేవి, దుబ్బా పోతులయ్య ఎనుములు పెట్టుకుని జీవనం గడుపుతున్నారు. వీరు రెండు ట్రాక్టర్ల గడ్డిని పశువుల కోసం ఇంటి సమీపంలోని కల్లంలో వాము వేసుకున్నారు. ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుని గడ్డివాము కాలి బూడిదైపోయింది. రూ.40 వేలు నష్టం వాటిల్లిందని, అధికారులు ఆదుకోవాలని బాధితులు కోరారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నాగమణి

గుత్తి: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ పీడీ నాగమణి, తహసీల్దార్ పుణ్యవతి అన్నారు. గుత్తిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల కట్టడిపై అవగాహన కార్యక్రమంనిర్వహించారు. పురోహితులు, చర్చిల పాస్టర్లు, హాజీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం వల్ల మాతా శిశు మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అలాగే ఆడపిల్లల జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లెతే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మాథ్యూ, సీడీపీఓ భారతి, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ సీఐ విచారణ


మాట్లాడుతున్న విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు

యల్లనూరు: గత ప్రభుత్వంలో 'ఆడుదాం ఆంధ్ర' కోసం విడుదలైన నిధులు, కిట్లపై శుక్రవారం విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పంపిణీ చేసిన పరికరాలు ఏమయ్యాయని పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణ సాగర్, డిప్యూటీ ఎంపీడీఓ మనోహర్‌బాబు, ఏఓ వాసుదేవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి'

గుత్తి రూరల్: పట్టణంలో హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని బీజేపీ నాయకులు కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాస్‌కు బీజేపీ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. బీజేపీ నాయకులు ఓబుళయ్య, బలకనారాయణరెడ్డి, నూరుల్ హసన్ బాషా, ప్రేమ్‌కుమార్‌లు మాట్లాడుతూ గుత్తి మునిసిపాలిటీ పరిధిలో హిందూ శ్మశాన వాటిక లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హిందువుల అంత్యక్రియల కోసం పట్టణంలో ఐదు ఎకరాల భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలని వారు ఆర్డీఓను కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవీవిరమణ పొందిన తెలుగు ఉపాధ్యాయుడు కోన రాజారెడ్డిని శుక్రవారం హెచ్ఎం సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలలోనే పదవీ విరమణ పొందడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు కాశెప్ప, ధనలక్ష్మి, విశ్రాంత హెచ్ఎంలు విజయమ్మ, విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు రవికుమార్, నాగన్న, శ్రీనివాస యాదవ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో మగ్గిపోతున్నా.. పట్టించుకోరా?


ఏడీకి సమస్యలు వివరిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కసాపురం రోడ్ వద్ద ఉన్న నాయీ బ్రాహ్మణ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నాలుగైదు రోజులవుతోంది. కాలనీవాసులు అంధకారంలో మగ్గిపోతున్నారని ట్రాన్స్‌కో ఏఈ, లైన్‌మెన్‌లకు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వేణుగోపాల్ ఆరోపించారు. శుక్రవారం ఏడీఈ నాగేంద్ర కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఏడీకి ఫిర్యాదు చేశారు. అసలే వర్షాకాలం, పక్కనే రైల్వేట్రాక్, ఆపై కాలనీ చుట్టూ ముళ్లకంపల కారణంగా విష సర్పాలు అధికంగా తిరుగుతుండటంతో కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఏఈ, లైన్‌మెన్ నిర్లక్ష్యం వీడకపోతే ట్రాన్స్‌కో ఆఫీసు ఎదుట ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఏడీఈ హామీ ఇచ్చారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన నాయకులు


జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న కంచం రామ్మోహన్‌రెడ్డి, గూడూరు సత్యనారాయణరెడ్డి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలో తాడిపత్రి నాయకులు కంచం రామ్మోహన్‌రెడ్డి, గూడూరు సూర్యనారాయణరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు తాడిపత్రి రాజకీయ పరిస్థితులను ఆయనకు వివరించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని జగన్ సూచించినట్లు వారు తెలిపారు.

రిలే దీక్షలకు వైఎస్సార్‌సీపీ నాయకుల మద్దతు


కార్మికులకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని మూడురోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలేదీక్షలు చేపట్టిన కార్మికులకు వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలిపారు. శుక్రవారం దీక్షబూనిన కార్మికులను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాది లింగేశ్వరబాబు, మున్సిపల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు సుంకప్ప, హనుమేష్ తదితరులు కలిసి సంఘీభావం తెలిపారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను పెంచడంతో పాటు వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కార్మిక జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, మల్లేష్, సహాయ కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ


విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

యల్లనూరు: మండలంలోని చింతకాయమంద గ్రామానికి చెందిన రాజేంద్ర, లక్ష్మయ్య ఇటీవల మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో రాజేంద్ర దాడి చేయడంతో లక్ష్మయ్య గాయపడ్డాడు. ఘటనపై పోలీసులు అట్రాసిటీ కేసు కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో విచారణ చేపట్టారు కార్యక్రమంలో పుట్లూరు సీఐ సత్యబాబు, ఏఎస్ఐ సంపత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా శ్రీధర్‌మూర్తి



బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల తహసీల్దార్‌గా శ్రీధర్‌మూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న పుణ్యవతి గుత్తి మండలానికి బదిలీ అయ్యారు. పామిడిలో తహసీల్దార్‌గా పని చేస్తున్న శ్రీధర్‌మూర్తి బీకేఎస్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్‌మూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రాము

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాముకు జిల్లా ఉన్నతాధికారులు ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలను అప్పగించారు. శుక్రవారం ఆయన బాధ్యతలను తీసుకున్నారు. రాము మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానన్నారు. అలాగే ఆర్ఐగా బత్తలపల్లి నుంచి యల్లనూరుకు బదిలీ అయిన విజిత శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆమె వీఆర్వోలతో సమావేశమై మండల పరిస్థితులపై సమీక్షించారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం


గుంతకల్లులో రిటైర్డ్ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందిని సన్మానిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి


యాడికిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి


గార్లదిన్నెలో పదవీ విరమణ పొందిన వీఆర్ఓలను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/యాడికి/గార్లదిన్నె/పెద్దపప్పూరు/పెద్దవడుగూరు/శింగనమల/యల్లనూరు/పామిడి: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రెవెన్యూ వ్యవస్థ కీలకమన్నారు. గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవంలో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న ఉద్యోగులకు ఆర్డీఓ శ్రీనివాస్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం పదవీ విరమణ పొందిన రిటైర్డ్ తహసీల్దార్లు ఇఓ.రాముడు, చలపతి, బీటీ.సరస్వతీ, ఈడీటీ శివప్రసాద్, డీటీ రాజశేఖర్, ఇతర రెవెన్యూ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసిల్దార్ రమాదేవి, డీటీ నారాయణస్వామి, రీసర్వే డీటీ రాజ్‌కుమార్, మండల సర్వేయర్ మారెప్ప, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

- యాడికి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన రెవిన్యూ సిబ్బంది రెవిన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత వీఆర్ఓ పుల్లారెడ్డి, ప్రస్తుత వీఆర్ఏలు రంగనాయకులు, ఓబులేసును తహసీల్దార్ సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ క్రిష్టప్ప, వీఆర్ఓలు, వీఆర్ఏలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.
- గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఈరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- పెద్దపప్పూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ బాలాజీరాజు, సిబ్బంది పాల్గొన్నారు.
- పెద్దవడుగూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందిని సన్మానించారు. తహసీల్దార్ ఉషారాణి, డీటీ వెంకటేశ్వరమ్మ, రీ సర్వే డీటీ జయమ్మ, మండల సర్వేయర్ ప్రసాద్, ఆర్ఐ లహరిక, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- శింగనమలలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ , డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్, రీ సర్వే డీటీ నారాయణస్వామి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ హబీబా, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- యల్లనూరు తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. తహసీల్దారు రాము, రీ సర్వే డీటీ మునీంద్ర, మండల సర్వేయర్ షర్వాణి, ఆర్ఐ విజిత, వీఆర్వోలు పాల్గొన్నారు.
- పామిడి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ షర్మిల, డీటీ రామకృష్ణ, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

యాడికి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపడుతూ అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మండలంలోని నగరూరు గ్రామంలో ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం మలేరియా వ్యతి రేక మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలు, కుంటలు, పాత టైర్లు, కుండల్లో నీటి నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అలాగే రాత్రిపూట దోమ తెరలను ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కుళ్లాయప్ప, రాయలచెరువు పీహెచ్‌సీ సూపర్వైజర్ షబ్బీర్‌బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి మృతి

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి టోల్ ప్లాజా వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుత్తి పట్టణానికి చెందిన వీరేంద్ర(25) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. వీరేంద్ర పామిడికి వెళ్లి ద్విచక్ర వాహనంపై గుత్తికి వస్తుండగా.. టోల్ ప్లాజా సమీపంలోని అమోఘ హోటల్ ఎదుట కుక్క అడ్డుగా వచ్చింది. కుక్కను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న పొల్యూషన్ చెకప్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా, ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చొన్న షఫీ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను 108లో గుత్తికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ క్వార్టర్స్‌లో అగ్ని ప్రమాదం

గుంతకల్లు టౌన్: స్థానిక పోలీస్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న హెడ్ కానిస్టేబుల్ ఇజ్రాయెల్ కుమార్ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు ఎగిసి పడి మంటలు వ్యాపించాయి. ఇంట్లోని దుస్తులు, ఫర్నీచర్, ఫ్రిడ్జ్, ఇతర విలువైన ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, బీరువాల్లో భద్రపరిచిన డాక్యుమెంట్లు, నగదు కాలిబూడిదయ్యాయి. పామిడి పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఇజ్రాయెల్ గుంతకల్లులోని పోలీస్‌క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. 21న విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమ బందోబస్తు డ్యూటీకి వెళ్లారు. ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు నంద్యాలకు వెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇరుగుపొరుగు వారు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు.